హైదరాబాద్ వార్త





- రోజురోజుకు పెరుగుతున్న పెట్రోల్,డీజిల్ ధరలు
- గత వారం రోజుల్లో రెండు సార్లు పెంపు
- ప్రస్తుతం లీటర్ పెట్రోల్ రూ.110.88, డీజిల్ రూ.98.99

# సామాన్యుడిపై పెట్రో భారం

**హైదరాబాద్, మే 19,ప్రభాతవార్త:** వాహనదారులకు మరోషాక్ తగలింది. హైదరాబాద్ తో పాటు పలు ప్రాంతాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు మళ్లీ పెరిగాయి. గత ఐదు రోజుల్లోనే ఇది రెండోసారి పెంపు కావడం గమనార్హం. ఇప్పటికే గత శుక్రవారం పెట్రోల్‌పై లీటర్ కు రూ.3.14, డీజిల్‌పై రూ.3.11 పెరగగా.. తాజాగా మరోసారి ధరలను పెరిగాయి. ఈసారి పెట్రోల్, డీజిల్‌పై అదనంగా 90 పైసలు చొప్పున పెరిగింది.

పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు నుంచే అమల్లోకి వచ్చాయి. దీంతో హైదరాబాద్ నగరంలో పెట్రోల్ ధర లీటర్ కు రూ.110.88కు చేరుకోగా.. డీజిల్ ధర రూ.98.99కు పెరిగింది. వరుసగా ఇంధన ధరలు పెరుగుతుండటంతో సామాన్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రోజూ వాహనాలు ఉపయోగించే ఉద్యోగులు, వ్యాపారులు, ఆటో డ్రైవర్లపై ఈ భారం తీవ్రంగా పడుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల మార్పులు, రాష్ట్ర పన్నులు, రవాణా ఖర్చులు వంటి కారణాల వల్లే ఇంధన ధరలు పెరుగుతున్నాయని ఆయిల్ కంపెనీలు చెబుతున్నాయి. అయితే వరుస పెరుగుదలలతో సామాన్య ప్రజల జీవన వ్యయం మరింత భారంగా మారుతోంది. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిన సమయంలో ఇంధన ధరల పెంపు మరో దెబ్బగా మారిందని ప్రజలు అంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం తెలివిగా వినియోగదారుడిపై భారాన్ని మోపుతుంది. ఆభారాన్ని ఒకే సారికాకుండా రోజుకింత అన్నట్లుగా వేస్తున్నారు. రోజూ ఎంతో కొంత పెంచుతూ సామాన్యునిడిని కోలుకోలేని విధంగా దెబ్బతీస్తున్నది.

## వాహనదారుల గగ్గోలు..

నష్టాలను మూట కట్టుకుంటున్నామటూ ఆయిల్ కంపెనీలు పెట్రోల్,డీజిల్ ధరలను ఇష్టానురీతిగా పెంచేస్తుండటంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. ప్రధానంగా డీజిల్ ధరను పెంచడటంతో ఈప్రభాతం అన్ని రంగాలపై పడుతుంది. ప్రధానంగా రవాణా రంగంపై దీని ప్రభావం పడి అన్ని రకాల వస్తువుల ధరలు చుక్కలంటుతున్నాయి.అనేక మంది మధ్యతరగతి జీవులు చాలీచాలని జీతాలతో వారివారి వృత్తుల నిర్వహానకు ద్విచక్రాహానాలను కొనుగోలు చేస్తున్నారు. పెట్రోల్ ధరలు మరిత ప్రియం కా నుండటంతో వారి ఆదాయంలోని సగభాగం పె ట్రోల్ కే కేటాయించాల్సి వస్తోందంటూ వాపోతున్నారు.

# పైప్‌లైన్ మరమ్మతుల పనులను పరిశీలించిన జలమండలి ఎండీ

### -పనులు సత్వరమే పూర్తి చేయాలని ఆదేశాలు



రోడ్డు విస్తరణలో ధ్వంసమైన మంజీరా ఫేజ్-2 మెయిన్ పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న జలమండలి ఎండి అశోక్‌రెడ్డి

**హైదరాబాద్, మే 19 ప్రభాతవార్త :** హైదరాబాద్ నగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా ఫేజ్-2 లోని పటాన్‌చేరు నుంచి హైదర్‌నగర్‌లో ఉన్న 1500 ఎంఎం డయా పంపింగ్ మెయిన్ పైప్ లైన్ ను నేషనల్ హైవే అథారిటీ అధికారులు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనుల సందర్భంగా పైప్‌లైన్ ధ్వంసం చేశారు. ఈ లీకేజీని అరికట్టడానికి జలమండలి అధికారులు చేపట్టిన అత్యవసర మరమ్మత్తు పనులను మంగళవారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని అధికారులతో చర్చించారు. మరమ్మతుల పనులపై తాజా పరిస్థితి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్, ట్రాన్స్ మిషన్ అధికారులు సమన్వయంతో పనులు చేపట్టాలని సూచించారు. సాధ్యమైనంత తొందరగా పనులు పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని ఎండీ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎండి అశోక్‌రెడ్డి మాట్లాడుతూ మరమ్మత్తు పనులు పూర్తయ్యిన నీటి సరఫరాను దశలవారీగా పునరుద్ధరించబడుతుందన్నారు. వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు.

**జలమండలిలో ఉద్యోగాలంటూ అసత్య ప్రచారం...**

ఇటీవల సోషల్ మీడియా వేదికగా హైదరాబాద్ నీటి సరఫరా బోర్డు, తెలంగాణ రిక్రూట్మెంట్ 2026" పేరుతో ఒక పోస్టర్ వైరల్ అవుతోంది. ఆ పోస్టర్‌లో జలమండలిలో భారీ స్థాయిలో ఉద్యోగ నియామకాలు చేపడుతున్నట్లు, వేతనాలు,అర్హతల వివరాలు పేర్కొంటూ తప్పుడు ప్రచారం జరుగుతోందని జలమండలి ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ప్రస్తుతం పోస్టర్‌లో పేర్కొన్న విధంగా ఎలాంటి నియామక ప్రక్రియను జలమండలి చేపట్టలేదని, సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న సమాచారం పూర్తిగా అసత్యమని వెల్ల డించింది. జలమండలిలో ఉద్యోగ నియామకాలు చేపట్టాల్సి వచ్చిన సందర్భంలో, అవి ప్రభుత్వ నిబంధనల ప్రకారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్, లేదా సంబంధిత అధికారిక సంస్థల ద్వారా మాత్రమే నిర్వహించబడతాయని తెలిపిం ది. ఉద్యోగార్థులు సోషల్ మీడియాలో వైరల్ అవు తున్న నిర్ధారణ లేని పోస్టర్లు, సమాచారాలు, తప్పుడు ప్రకటనలను నమ్మవద్దని జలమండలి విజ్ఞప్తి చేస్తోంది.

# అక్రమ సిమ్‌కార్డుల దందాపై పోలీసుల దాడులు

### - 112 సిమ్‌లు స్వాధీనం ...ముగ్గురి అరెస్ట్

**జూబ్లీహిల్స్, మే 19, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో సైబర్ మోసాలకు వినియోగిస్తున్న అక్రమ సిమ్ కార్డుల వ్యవహారంపై నగర పోలీసులు వరుస దాడులు నిర్వహించి భారీ ఎత్తున సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. పంజాగుట్ట, ఖైరతాబాద్, లేక్ పోలీస్ స్టేషన్ పరిధుల్లో జరిగిన ప్రత్యేక ఆపరేషన్‌లో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రెండు కేసులు నమోదు చేశారు.నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్, బ్యాంకింగ్ సంస్థలు, టెలికాం సేవల సంస్థలు, అలాగే సంచార్ సాథీ పోర్టల్‌లోని చక్షు ద్వారా వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు దాడులు చేపట్టాయి. ఖైరతాబాద్ పోలీసులు పంజాగుట్టలో బ్లింకిట్ స్టోర్ ఎదుట రోడ్డుపై నిర్వహిస్తున్న ఓ మొబైల్ సిమ్ అవుట్‌లెట్‌పై దాడి చేశారు. అక్కడ బోడ భరత్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతను గత పదేళ్లుగా ఎయిర్‌టెల్ సిమ్ ప్రమోటర్‌గా పనిచేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. తన అసలు ఎయిర్‌టెల్ మిత్రా ఖాతా బ్లాక్ కావడంతో తన అన్న పేరుతో కొత్త రిటైలర్ అకౌంట్ సృష్టించి సిమ్ కార్డుల యాక్టివేషన్ నిర్వహిస్తున్నట్లు అంగీకరించాడు. అతని వద్ద నుంచి 54 యాక్టివేట్ చేయని ఎయిర్‌టెల్ సిమ్ కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇక రెండో ఘటనలో లేక్ పోలీసులు పంజాగుట్టలోని ద్వారకాపురి కాలనీలో ఉన్న నవాజ్ మొబైల్స్ దుకాణంపై దాడి నిర్వహించారు. అక్కడ కేవైసీ వివరాలను గుర్తింపుకార్డుదారుల అనుమతి లేకుండానే ఉపయోగించి అక్రమంగా సిమ్ కార్డులు యాక్టివేట్ చేస్తున్నట్లు గుర్తించారు. ఈ కేసులో మహ్మద్ నవాజ్, వొడ్డెరాజు సంతోష్ కుమార్ అనే ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో సంతోష్ కుమార్ అధికారిక ఎయిర్‌టెల్ పీఓఎస్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తూ తన ఎయిర్‌టెల్ మిత్రా యాప్ లాగిన్ వివరాలను మహ్మద్ నవాజ్‌కు ఇచ్చినట్లు తేలింది. ఇద్దరూ కలిసి ఒకే వ్యక్తి కేవైసీతో అనేక సిమ్ కార్డులను ఈకేవైసీ, డీకేవైసీ పద్ధతుల్లో యాక్టివేట్ చేసి వాటిని సైబర్ నేరగాళ్లకు సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. రెండో దాడిలో 58 యాక్టివేట్ చేసిన ఎయిర్‌టెల్ సిమ్ కార్డులు, ఒక బయోమెట్రిక్ పరికరం, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా రెండు కేసుల్లో కలిపి 112 ఎయిర్‌టెల్ సిమ్ కార్డులు, ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో నిందితులపై ఐటీ చట్టంలోని 66(సి), 66(డి) సెక్షన్లు, బీఎన్‌ఎస్ 318(4) సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై మల్కాజ్‌గిరి పోలీసుల ఉక్కుపాదం

### -ఒక్కరోజే 1,340 కేసులు నమోదు - రూ.13.39 లక్షల జరిమానా

**మల్కాజ్‌గిరి కమిషనరేట్ మే 19 ,ప్రభాతవార్త :** వాహనాలు నడుపుతూ సెల్‌ఫోన్ మాట్లాడుతున్న నిర్లక్ష్య డ్రైవర్లపై మల్కాజ్‌గిరి ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. కమిషనరేట్ వ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై భారీగా కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు.మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి ఆదేశాల మేరకు ట్రాఫిక్ జోన్1, జోన్2 పరిధిలోని అన్ని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, సిబ్బంది ప్రధాన కూడళ్లు, సిగ్నల్ పాయింట్లు, రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా నిర్వహించారు.ఈ తనిఖీల్లో సెల్‌ఫోన్ మాట్లాడుతూ, సందేశాలు పంపుతూ, వీడియోలు చిత్రీకరిస్తూ, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు వినియోగిస్తూ వాహనాలు నడిపిన వారిపై మొత్తం 1,340 కేసులు నమోదు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ. 13.39 లక్షల జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ బి. సుమతి మాట్లాడుతూ డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగం వల్ల డ్రైవర్ల ఏకాగ్రత దెబ్బతిని ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం అధికమవుతుందని హెచ్చరించారు. ఇటువంటి నిర్లక్ష్య డ్రైవర్లతో పాటు తోటి వాహనదారులు, పాదచారుల ప్రాణాలకు ముప్పుగా మారుతుందని పేర్కొన్నారు. వాహనం నడుపుతున్నప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ మొబైల్ ఫోన్ ఉపయోగించవద్దని, అత్యవసర పరిస్థితుల్లో వాహనాన్ని పక్కకు ఆపి మాట్లాడాలని సూచించారు.నిబంధనలు పదేపదే ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని, కమిషనరేట్ వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు.

# జనగణనలో నిర్లక్ష్యం తగదు : జడ్‌సి సత్యనారాయణ




జనగణన జరుగుతున్న తీరుపై సిబ్బందితో సమీక్షిస్తున్న జోనల్ కమిషనర్ సత్యనారాయణ

**చాంద్రాయణగుట్ట, మే 19, ప్రభాతవార్త :** నిబంధనల మేరకు జనగణన పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసి చార్మినార్ జోనల్ కమిషనర్ కె.సత్యనారాయణ సిబ్బందిని ఆదేశించారు. సరియైన సమాచారంతో సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. మంగళవారం నర్కిపూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో సంతోష్‌నగర్ సర్కిల్‌లో జరుగుతున్న జనగణనపై సూపర్‌వైజర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జెడ్సి సత్యనారాయణ మాట్లాడుతూ హెచ్‌ఎల్‌ఓలు నిర్దేశించిన యాప్‌లో, రికార్డులలో కుటుంబ వివరాలను ఇంటింటికి వెళ్ళి నమోదు చేయాలన్నారు. నిర్దేశించిన మొత్తం 33 ప్రశ్నలను సమాధానాలు సేకరించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదన్నారు. సూపర్‌వైజర్లు ఎన్యుమరేటర్లకు వచ్చే సందేహాలను, సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ సర్వే వేగం పెంచాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ భాస్కర్‌రెడ్డి,ఇంచార్జ్ ఎఎంసి నరహరి, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# రోగులకు నాణ్యమైన సేవలు అందించాలి

### -జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆకస్మిక తనిఖీలు



**అత్తాపూర్ మే19 ,ప్రభాతవార్త :** మైలార్ దేవ్ పల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.స్వర్ణ కుమారి అకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను , సిబ్బంది హాజరు పట్టికను ,హాస్పిటల్ లోని బెడ్లను , మెడిసిన్ ఎక్స్పైరీ డేట్‌లను హాస్పిటల్ ఆవరణను పరిశీలించారు. గర్భిణీలకు సరైన వైద్య సేవలు అందుతున్నాయా అని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు, అన్ని రకాల వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రిలో డెలివరీల సంఖ్య పెరిగేలా చూడాలని ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళా క్లీనిక్ ఏర్పాటు చేయాలని అలాగే మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని రక్తహీనత ఉన్నవారికి సరైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు కనీస సౌకర్యాలు కల్పించాలని వారు వేచి ఉండే ప్రాంతంలో కూర్చునే ఏర్పాట్లు, త్రాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని, ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలు చేరుకోవాలని, వైద్యులు మరియు సిబ్బంది ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల సేవా భావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు వేగవంతం

- -వాహనదారులకు తెలిసేలా స్పష్టంగా సైన్ బోర్డులు
- -ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు
- -ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి



ఉప్పల్ చౌరస్తాలో ఫ్లైఓవర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, చిత్రంలో ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, ఎంఎంసి చీఫ్ ఇంజనీర్ అశోక్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్, మే 19 ప్రభాతవార్త** ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల కారణంగా ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రతలు తీసుకోవాలని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉప్పల్ చౌరస్తాలో నిర్మాణంలో ఉన్న ఫ్లై ఓవర్ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఫ్లైఓవర్ నిర్మాణ పనుల కారణంగా ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వాహనదారులకు స్పష్టమైన మార్గదర్శకత్వం అందించేలా సరైన డైవర్షన్ సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ నిర్వహణలో సమన్వయం పెంచాలని అధికారులకు సూచనలు చేశారు. ఫ్లైఓవర్ పిల్లర్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి ప్రాజెక్టును నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. నగర ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం, ట్రాఫిక్ సమస్యలను తగ్గించడం మరియు మౌలిక వసతుల అభివృద్ధిని వేగవంతం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, ఎంఎంసి చీఫ్ ఇంజనీర్ అశోక్‌రెడ్డి, ఇఇ రోహిని, టౌన్ ప్లానింగ్ అధికారులు, ఉప్పల్ మరియు ఎల్బీనగర్ ట్రాఫిక్ అధికారులు పాల్గొన్నారు.

**జనగణనలో ప్రతి ఇల్లు మ్యాపింగ్...**

జనగణన కార్యక్రమాలను ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి పరిశీలించారు. ఎన్ఎఫ్‌సీ నగర్‌లో ఎన్యూమరేటర్లతో మాట్లాడి క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పనుల పురోగతిని తెలుసుకున్నారు. జనగణనలో ఏ ఇంటిని కూడా మిస్ కాకుండా సర్వే మ్యాపులు,మార్గదర్శకాల ప్రకారం ఖచ్చితంగా డేటా సేకరణ చేపట్టాలని ఆదేశించారు. సూపర్‌వైజర్లు,కోఆర్డినేటర్లు ఎన్యూమరేటర్ల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఘట్‌కేసర్, ఎదులాబాద్ చెరువు, మల్లిపల్లిగూడ ప్రాంతాల్లో అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించారు. పారిశుధ్యం, దోమల నివారణ, జనగణన కార్యక్రమాలు,చెత్త సేకరణ పనులను సమీక్షించారు. దోమ లార్వా నివారణకు ఉపయోగిస్తున్న రసాయనాలు మరియు చేపడుతున్న చర్యలు, పక్షులు మరియు జంతు వులకు ఎలాంటి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటూ దోమల నియంత్రణ చర్యలను సమ ర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూ చించారు. ప్రతి ఇంటిని సాట్ ఆటో సేవలకు అనుసంధానం చేసి ఇంటింటి చెత్త సేకరణను క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. పారి శుధ్య నిర్వహణను మరింత మెరుగుపరచేందుకు సాట్ ఆటోల సంఖ్యను పెంచాలని అధికారులకు తెలిపారు.

**ఆరోగ్యకరమైన సమాజానికి క్రీడలు ప్రోత్సాహం..,**

యువతను క్రీడల వైపు ప్రోత్సహించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి తోడ్పడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. ఎదులాబాద్ వాలీబాల్ మైదానంలో కొనసాగుతున్న సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కోచ్‌లు,క్రీడాకారులతో కమిషనర్ మాట్లాడి శిక్షణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, క్రీడాభివృద్ధికి అవసరమైన సహకారంపై వివరాలు తెలుసుకున్నారు. క్రీడాకారులు మరియు కోచ్‌లు వెల్లడించిన సమస్యలు, అవసరాలను నమోదు చేసి వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అవసరమైన సౌకర్యాలను త్వరితగతిన కల్పించి క్రీడాకారులకు మెరుగైన శిక్షణ వాతావరణం కల్పించాలని సూచించారు. ఎంఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో క్రీడా శిక్షణ, పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు.

# అవినీతికి కేరాఫ్ కూకట్‌పల్లి జోన్ ఇంజనీరింగ్ విభాగాలు

### -కోట్లు స్వాహా చేస్తున్న అవినీతి తిమింగలాలు
### -ఇఇలు, డీఇల ఇష్టారాజ్యం




కూకట్‌పల్లి జోన్ కార్యాలయం

**కూకట్‌పల్లి జోన్ ప్రతినిధి, మే 19, ప్రభాతవార్త** కూకట్‌పల్లి జోన్ పరిధిలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఇఈ) డీఇల కార్యాలయాల్లో అవినీతి రాజ్యమేలుతోంది. ఈ కార్యాలయాల్లో చేయి తడిపితే కానీ కొందరు అధికారులు, సిబ్బంది పనులు చేయడం లేదంటే ఇంజనీరింగ్ కార్యాలయాల్లో ఏమేరా అవినీతి నెలకొందో అర్థం అవుతోంది. తమ పనులను చేయాలని వెళ్లిన కాంట్రాక్టర్లకు ఫైళ్లలో లేనిపోని కారణాలు చూపిస్తూ కొందరు అధికారులు పెండింగ్‌లో పెట్టడం సర్వసాధారణమైంది. సర్కిల్ 50 మాదాపూర్, 51 సర్కిల్ ఆల్విన్ కాలనీ, 52 సర్కిల్ కూకట్‌పల్లి, 53 సర్కిల్ మూసాపేట ఇఇ, డీఇ, ఏఇల కార్యాలయాల్లో అవినీతి, అక్రమ వసూళ్లకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. కొందరు అధికారులు అయితే ఇష్టారాజ్యంగా వసూళ్లకు పాల్పడుతూ రూ. కోట్ల మేర ప్రభుత్వ నిధుల్ని పక్కదారి పట్టిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కోట్లు స్వాహా చేస్తున్న అవినీతి తిమింగలాలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దృష్టి సారించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అభివృద్ధి పనుల్ని పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు తాము అడిగినన్ని మామూళ్లు ఇచ్చేంతవరకు బిల్లులు చెల్లించకుండా పగలే చుక్కలు చూపిస్తున్నట్లు సదరు ఇంజనీరింగ్ విభాగం అధికారులపై ఆరోపణలు ఉన్నాయి. పనులు పూర్తి చేసిన ప్రతి కాంట్రాక్టర్ ఇఇ, డీఇ, ఏఇల కార్యాలయాల్లో తప్పనిసరిగా ముడుపులు చెల్లించాల్సిందే. లంచాల రూపంలో ప్రతి కాంట్రాక్టర్ తాను పూర్తి చేసిన పనికి బిల్లులు రావాలంటే 20 శాతానికి పైగా వాటాల రూపంలో అవినీతి అధికారులకు చెల్లిస్తున్నట్లు సమాచారం. 20 శాతానికి పైగా ముడుపుల రూపంలో పైనుంచి కిందిస్థాయి దాకా జేబుల్లోకి వెళుతుండడంతో అభివృద్ధి పనుల్లో నాణ్యత కొరవడుతోంది. దీంతో చేసిన కొన్ని నెలలకే రోడ్లు అధ్వానంగా గుంటలు తేలి కనిపిస్తున్నాయి. ప్రతిఏటా కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనుల్ని చేపడుతున్నప్పటికీ ఎలాంటి ఫలితం లేకుండా పోతుంది. నాణ్యత లేకున్నా సరే తమ జేబులు నిండితే చాలు అన్న ధోరణిలో కొందరు అధికారులు వ్యవహరిస్తున్న కారణంగా అభివృద్ధి పనుల్లో నాణ్యత కొరవడడంతో గుంటలమయమై రోడ్లపై రాకపోకలు సాగిస్తున్న ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. తమ స్వార్థ ప్రయోజనాలకి పరిమితమైన ఇంజనీరింగ్ విభాగ అధికారులు జేబులు నింపుకుంటూ రూ.కోట్లకు పడగలెత్తుతున్నారు.

**రూ. కోట్లు స్వాహా చేస్తున్న ఘనులు**

**ఇఇలు, డీఇలు కార్యాలయాల్లో ప్రతి పనికి ఒక రేటు**

ఇఇలు, డీఇలు కార్యాలయాల్లో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తున్న కొందరు అధికారులు చక్రం తిప్పుతున్నారు. ప్రతి పనికి ఒక రేటు కట్టి తమ అవినీతి దందా కొనసాగిస్తున్నారు. రూ. కోట్ల విలువ చేసే టెండర్లలో పెద్ద ఎత్తున అవకతవకలు జరుగుతున్నా. సీఎంసీ ఉన్నతాధికారులు, జోన్ అధికారుల అండదండలతో ఇఇలు, డీఇలు, ఏఇలు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

# రోడ్డు మధ్యలో ఉన్న 40సంవత్సరాల చెట్టు తొలగింపు...

### -మహాపరినిర్వాణలో పునరుజ్జీవం.
### -తిరుమలగిరి డివిజన్ ట్రాఫిక్ ఎసిపి శంకరరాజు



రోడ్డు మధ్యలో ట్రాఫిక్ కు అంతరాయంగా ఉన్న పెల్టోఫోరం చెట్టును మహపరినిర్వాణలో నాటిన దృశ్యం.

**బేగంపేట మే 19,ప్రభాతవార్త** నిత్యం ట్రాఫిక్ రద్దీగా ఉండే శ్యాంలాల్ జంక్షన్ లో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయంగా మారిన 40ఏళ్ల వయస్సు కలిగిన పెల్టోఫోరం చెట్టును అక్కడి నుంచి తొలగించి శ్యాంలాల్ బిల్డింగ్ మహాపరినిర్వాణలో పునరుజ్జీవం కల్పించామని తిరుమలగిరి ట్రాఫిక్ ఏసీపీ జి.శంకరరాజు తెలియజేసారు.ఎన్నో ఏళ్లుగా ఈ చెట్టుతో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం కలుగుతుందంటూ స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసికెళ్లడం,ఇటీవల కాలంలోఈ మార్గంలో ట్రాఫిక్ రద్దీ మరింత పెరగడంతో మంగళవారం ట్రాఫిక్ ఏసీపీ జి.శంకరరాజు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు శ్యాంలాల్ జంక్షన్ కు చేరుకుని జేసీబీ సహాయంతో చెట్టును అక్కడి నుంచి తొలగించారు.ఆ చెట్టును వెంటనే మహాపరినిర్వాణకు తరలించి అక్కడ పునరుజ్జీవం కల్పించారు.సంబంధిత అధికారుల అనుమతులు పొందిన తరువాత పెల్టోఫోరం చెట్టును జాగ్రత్తగా అక్కడి నుంచి తరలించారు. మహాపరినిర్వాణలో నాటిన చెట్టు సంరక్షణను పర్యవేక్షించనున్నట్లు శంకరరాజు తెలియజేసారు.చెట్టు తొలగింపుతో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రయాణీకుల భద్రత మెరుగు పడుతుందని,హరిత వాతావరణం కూడా పరిరక్షించబడుతుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో బేగంపేట ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఇన్స్‌పెక్టర్ జి.జానకి రాములు,బేగంపేట ట్రాఫిక్ పోలీసు సిబ్బంది ,జీహెచ్‌ఎంసీ,యూబీడీ విభాగం తో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకుడు హాజీటోచర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే లక్ష్యంగా నిర్ణయాలు

### డిసిసిబి చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య...



**తుర్కయాంజల్, మే 19( ప్రభాతవార్త)**
తుర్కయాంజల్ రైతు సేవా సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన పర్సన్ ఇంచార్జ్ కమిటీ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సంఘము చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య అధ్యక్షతన సంఘ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో రైతుల సంక్షేమం, సంఘ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సంఘంలో నూతన సభ్యులుగా 11 మందిని చేర్చుకున్నారు. అలాగే 13 మంది రైతులకు మొత్తం రూ.1.65 కోట్ల రుణాలను మంజూరు చేసినట్లు వెల్లడించారు. రైతుల ఆర్థికాభివృద్ధికి సహకార సంఘం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని సమావేశంలో పేర్కొన్నారు. సంఘం 2025 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ కాని ముగింపు లెక్కలను ఆమోదించడంతో పాటు, 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ నెల జమాఖర్చుల వివరాలను కూడా సమావేశంలో ఆమోదించారు. అదేవిధంగా సంఘ సభ్యుల సంక్షేమం కోసం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కమిటీ సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో సంఘ సభ్యులు కొత్త రాంరెడ్డి, చెక్క లక్ష్మమ్మ, సామ సంజీవరెడ్డి, కుతడి నర్సింగ్ రావు, వంగేటి లక్ష్మారెడ్డి, కొండ్రు స్వప్న, చావల యాదగిరి, శీలం లక్ష్మమ్మ, జక్క కృష్ణారెడ్డి, సామ సత్యనారాయణ రెడ్డి. సంఘ సెక్రటరీ వై. రాందాస్ పాల్గొన్నారు

## సెంట్రింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



కార్మికులకు లేబర్ కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.

**వనస్థలిపురం మే.19.ప్రభాతవార్త.**
సెంట్రింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీ నందు సెంట్రింగ్ కాంట్రాక్టర్ అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమానికి అతిథిగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరై మాట్లాడారు... పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, కార్మికులకు భద్రతా పరికరాలు అందించాలని, పని సమయంలో ప్రమాదాలకు గురైన వారికి తగిన నష్టపరిహారం కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు నిర్మాణ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న సెంట్రింగ్ కార్మికుల సంక్షేమం పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మీ యొక్క కష్ట సుఖాలల్లో తోడుగా ఉంటా, మీరందరూ క్రమశిక్షణగా ఉండి ఓపికతో పోరాటం చేయండి మీతో పాటు పోరాడుత అని అన్నారు. అనంతరం పలువురి సభ్యులకు సుధీర్ రెడ్డి గారు లేబర్ కార్డులు అందజేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ బారాస పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, ఉద్యమకారులు మాధవరం నరసింహారావు, మల్లేష్ గౌడ్, అధ్యక్షులు నర్సింహ, ఉపాధ్యక్షులు రాఘవేంద్ర, ప్రధాన కార్యదర్శి గోవింద్, కార్యదర్శి అంజి, కోశాధికారి ఆంజనేయులు పలువురు కార్మిక సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సమాజ అభ్యున్నతికి సమిష్టిగా కృషి చేయాలి



**నేరేడ్‌మెట్ మే 19, ప్రభాతవార్త :**
మల్కాజిగిరి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన ఆలంపల్లి సురేష్‌ను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మామ సూదిని పద్మారెడ్డి, తెలంగాణ గ్రామపంచాయతీ ట్రైబ్యునల్ చైర్మన్ సూదిని రాంరెడ్డి ఘనంగా సన్మానించారు. మల్కాజిగిరిలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆర్యవైశ్య సంఘ సభ్యులు, ప్రముఖులు, యువత, అభిమానుల సందడితో ఉత్సాహభరితంగా సాగింది. ఈ సందర్భంగా సూదిని రాంరెడ్డి మాట్లాడుతూ ఆర్యవైశ్య సమాజ ఐక్యత, అభివృద్ధి కోసం సంఘ నాయకత్వం సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ఆలంపల్లి సురేష్ యువతను సమాజ సేవ వైపు తీసుకెళ్లడంతో పాటు సంఘాన్ని మరింత బలోపేతం చేస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. సమాజానికి సేవ చేసే నాయకత్వానికి అందరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. సూదిని పద్మారెడ్డి మాట్లాడుతూ సమాజ సేవలో యువ నాయకత్వం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఆర్యవైశ్యుల అభ్యున్నతి, సామాజిక ఐక్యత, సేవా కార్యక్రమాల విస్తరణలో మల్కాజిగిరి ఆర్యవైశ్య సంఘం ముందుండాలని ఆకాంక్షించారు. సమాజ ప్రయోజనాల కోసం సంఘం చేపట్టే కార్యక్రమాలకు తమ పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. అనంతరం ఆలంపల్లి సురేష్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, సభ్యులు, మహిళలు, యువకులు పాల్గొని నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## నూతన అధ్యక్షులుగా ఓర్సు శ్రీనివాస్, కోసిక ఐలయ్య

**తుర్కయంజాల్, మే 19 ( ప్రభాతవార్త)**



జిహెచ్ఎంసి ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని తుర్కయంజాల్, తొర్రూర్ డివి జన్లకు కాంగ్రెస్ పార్టీ నూతన అధ్య క్షులుగా ఓర్సు శ్రీని వాస్, కోసిక ఐలయ్య నియమితులయ్యారు. సోమవారం హైదరా బాద్‌లోని గాంధీ భవన్ లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వ ర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా వారికి అధికారిక నియామక పత్రాలు అందజేశా రు. అధ్యక్షులు ఓర్సు శ్రీనివాస్, కోసిక ఐలయ్య మాట్లాడుతూ, తమపై నమ్మకం ఉంచి డివిజన్ల అధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రతి కార్యకర్తకు ప్రాధాన్యత కల్పిం చడం తమ ప్రధాన బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఇబ్రహీం పట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి నాయకత్వంలో మాకు గౌరవించి అధ్యక్షుల పదవులు ఇచ్చినందుకు వారికి కృతజ్ఞలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు కొత్త కుర్మా మంగమ్మ శివకుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయ కులు సామ భీమ్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, ఎం.రాజు నాయక్, వేముల శంకర్, సామల రవీందర్ రెడ్డి, వరికుప్పల శ్రీరాములు, హనుమంత్ గౌడ్, పల్లె రాజు, ఎండి షఫీ, తదితరులు పాల్గొన్నారు

## నత్తనడకన ఎస్ఎన్‌డీపీ నాలా పనులు: సబితాఇంద్రారెడ్డి



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

**ఎల్.బి.నగర్, మే 19 ప్రభాతవార్త:** ఎస్ఎన్‌డీపీ నాలా పనులు మొత్తం అడగను సాగుతున్నాయని దీంతో కాలనీ వాసులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్కేపురం డివిజన్ విజయపురికాలనీలో మంగళవారం సబితా ఇంద్రారెడ్డి పర్యటించి ఎస్ఎన్‌డీపీ నాలా పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలానిర్మాణ పనులలో తీవ్ర జాప్యం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలువల పనులు పూర్తికాకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు, రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. ఇప్పటికే వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పనులను వేగవంతం చేసి వెంటనే పూర్తి చేయాలని అధికారులను కోరారు. మధ్యలో నిలిచి పోయిన పనులను తిరిగి ప్రారంభించి, వర్షాల సమయంలో నగరం మునిగిపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నగరాభివృద్ధి దృష్టిలో పెట్టుకొని ఎస్ఎన్‌డీపీ నాలాల ప్రాజెక్టును ప్రారంభించారని, అయితే ప్రస్తుతం పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. దాదాపు రెండు సంవత్సరాలుగా పనులు కొనసాగుతున్నప్పటికీ ఇంకా ఎందుకు పూర్తి కాలేదని ప్రశ్నించారు. అలాగే నగరంలో చెత్త సమస్య, తాగునీటి ఇబ్బందులు కూడా తీవ్రమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతోందని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మున్సిపల్ శాఖ అధికారులు బాధ్యతగా పనిచేసి చెత్త తొలగింపు, కాలువల శుభ్రత, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. వర్షాకాలానికి ముందే అన్ని డ్రైనేజీ, నాలాల పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అలాగే నగరంలోని మూడు కార్పొరేషన్లకు స్పష్టమైన బాధ్యతలు కేటాయించి సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మహేశ్వర నియోజకవర్గం ప్రధానకార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, మహిళా విభాగం మహేశ్వరం నియోజకవర్గం వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీతరెడ్డి, ఆర్కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, మహిళా విభాగం అధ్యక్షురాలు లిక్కీ ఊర్మిళారెడ్డి, అధికారులు, కాలనీవాసులు, నాయకులు పాల్గొన్నారు.


## ఎఫ్‌సెట్ టాప్ ర్యాంకర్ మల్లాది రుషికి కెటిఆర్ సత్కారం



రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించిన మల్లాది రుషికి చెక్ అందజేస్తున్న మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, మే 19 ప్రభాతవార్త :** ఎప్‌సెట్ ఇంజనీరింగ్‌లో రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంక్ సాధించిన మల్లాది రుషికి మంగళవారం బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్, ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఘనంగా సత్కరించారు. ఎంసెట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 156.63 మార్కులతో రాష్ట్ర స్థాయిలో తొలి ర్యాంక్ సాధించిన చిలుకానగర్ డివిజన్‌కు చెందిన మల్లాది కొండల్‌రెడ్డి కుమార్తె మల్లాడి రుషికి మాజీ మంత్రి కేటిఆర్ అభినందించారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కేటిఆర్ చేతుల మీదుగా రూ.లక్ష చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటిఆర్ మాట్లాడుతూ సాధారణ కుటుంబ నేపధ్యం నుంచి వచ్చి కష్టపడి చదివి రాష్ట్రంలోనే మొదటి స్థానం సాధించడం ఎంతో గొప్ప విషయమని అన్నారు. మల్లాది రుషి విజయం చిలుకానగర్ డివిజన్‌తో పాటు రాష్ట్రానికే గర్వకారణమని పేర్కొన్నారు. నేటి యువత లక్ష్యసాధన కోసం పట్టుదలతో ముందుకు సాగితే ఎలాంటి విజయాని అయినా అందుకోవచ్చని రుషి నిరూపించిందని కొనియాడారు. విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలన మరియు నిరంతర శ్రమతో చదివితే ఉన్నత ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మల్లాడి రుషి సాధించిన విజయంపై సంతోషం వ్యక్తం చేస్తూ, తెలంగాణ విద్యార్థులు దేశ స్థాయిలో తమ ప్రతిభను చాటుతున్నారని అన్నారు. రుషి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, మాజీ కార్పొరేటర్ ప్రభుదాస్, నేతలు సోమ శేఖర్ రెడ్డి, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## పెరిగిన ఇంటి పన్నుల విషయమై జిహెచ్ఎంసి కమిషనర్‌తో చర్చిస్తా : ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



మీర్‌పేట్, జిల్లెలగూడ కాలనీ సంక్షేమ సంఘాలు, కాలనీవాసులనుద్దేశించి మాట్లాడుతున్న సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, మే 19 ప్రభాతవార్త:**
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇది వరకే పెరిగి ప్రజలకు ఆర్థిక భారమైన ఇంటి పన్నులను తగ్గించడానికి సహకరిస్తానని స్థానిక మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి ఇంటి పన్నులు పెరిగిన ప్రాంతాల ప్రజలకు హామీనిచ్చారు. మీర్‌పేట్ పాత మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, కాలనీవాసులు మంగళవారం జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి తరలి వచ్చి సబితారెడ్డిని కలిసారు. ఈ సందర్భంగా వారు పెరిగిన ఇంటి పన్నుల విషయమై ఆమె దృష్టికి తెచ్చి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు పన్నుల తగ్గింపు కోసం చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆమెకు వినతి పత్రాన్ని అందజేశారు. అయితే క్యాంపు కార్యాలయంలో వారితో సమావేశమైన సబితారెడ్డి మాట్లాడుతూ జిహెచ్ఎంసిలో పన్నుల విధింపు విధానం.. అమలు ఏ విధంగా ఉందో అదే విధంగా మీర్‌పేట్ పాత కార్పొరేషన్ పరిధిలో కూడా ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ఈ విషయమై జిహెచ్ఎంసి కమీషనర్‌తో చర్చిస్తానని ఆమె పేర్కొన్నారు. ఇంటి పన్నులు తగ్గించే వరకు కాలనీవాసులకు అండగా ఉంటానని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ పాత కార్పొరేషన్‌కు చెందిన మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల నేతలు, వివిధ కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

## రూ.3.71 కోట్ల సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన



**నేరేడ్ మెట్,మే 19,ప్రభాతవార్త :**
యాప్రాల్-కౌకూర్ డివిజన్ పరిధిలో పలు కాలనీల్లో రూ.3.71 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. లక్ష్మీపురి కాలనీ, మహాలక్ష్మీపురం, మెహర్‌బాబా కాలనీ, సాయి క్రిష్ ఎన్‌క్లేవ్ ఫేజ్2, భాను ఎన్‌క్లేవ్, మల్లారెడ్డి కాలనీ ప్రాంతాల్లో భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. లక్ష్మీపురం కాలనీలో రూ.1.33 కోట్లతో, మహాలక్ష్మీపురం కాలనీలో రూ.43 లక్షలతో, మెహర్‌బాబా కాలనీలో రూ.62 లక్షలతో, సాయి క్రిష్ ఎన్‌క్లేవ్ ఫేజ్2లో రూ.43 లక్షలతో, భాను ఎన్‌క్లేవ్‌లో రూ.57 లక్షలతో, మల్లారెడ్డి కాలనీ కౌకూర్ ప్రాంతంలో రూ.33 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం కౌకూర్ మెయిన్‌రోడ్డులో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ పద్మలత, ఈఈ సత్యలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు జీకే హనుమంతరావు, జేఏసీ వెంకన్న, కరంచంద్, శోభ, రమేష్, శివగౌడ్, సాయిగౌడ్, చిందం శ్రీనివాస్, లక్ష్మణ్ యాదవ్, నిర్ణీత్‌రెడ్డి, సురేష్, శివ, నవీన్‌రాజ్, నర్సింగ్, విక్రమ్, మల్లేష్, హనుమాన్‌చారి, రాజేష్, హేమంత్‌పటేల్, వంశీ, రాజశేఖర్, శివసాయి తదితరులు పాల్గొన్నారు.

## పుచ్చపల్లి సుందరయ్య స్ఫూర్తితో సిపిఎం నాయకులు, కార్యకర్తలు పని చేయాలి

### మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి పిలుపు



పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

**సరూర్‌నగర్, మే 19 ప్రభాతవార్త:** దక్షిణ భారత దేశంలో కమ్యూనిస్టు శిఖరం, పార్టీ నిర్మాత స్వర్గీయ కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల పక్షాన నిలబడి అలుపెరుగని ఉద్య మాలు చేయాలని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా బాలాపూర్ మండ లం బడంగ్‌పేట్ సర్కిల్‌లోని మీర్‌పేట్ కేశవరెడ్డినగర్ కమ్యూనిటీ హాల్ లో సభను నిర్వహించారు. బాలాపూర్ మండల సిపిఎం పార్టీ, ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన నర్సిరెడ్డి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దక్షిణ భారత దేశంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి సుందరయ్య చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. నాటి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా అదే విధంగా భూస్వాములు వెట్టి చాకిరి, దోపిడీకి వ్యతిరేకంగా కమ్యూ నిస్టుల తరపున పోరాటాలు నిర్వహించిన మహా నాయకుడు సుందర య్య అని గుర్తు చేశారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని నేటి సమాజంలో ప్రజలకు అండగా ఉంటూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్ర మంలో గోరెంకల నర్సింహ, జంగయ్య, ప్రకాశ్‌రెడ్డి, దాసరి బాబు, శేఖర్ యాదవ్, యాదగిరిచారి, యాదయ్య, లక్ష్మారెడ్డి, వెంకన్న, దాసరి నర్సింహ, ఇందిర, రాములయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి



కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సిపిఎం పార్టీ నేతలు

**ఉప్పల్, మే 19 ప్రభాతవార్త :**
కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41 వర్ధంతి సందర్భంగా ఉప్పల్ సిపిఎం ఆఫీస్‌లో సుందరయ్య చిత్రపటానికి పలువురు నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉప్పల్ సర్కిల్ సిపిఎం పార్టీ కార్యదర్శి జె.వెంకన్న, సర్కిల్ కమిటీ సభ్యురాలు ఊర్మిళ, స్వామి, సిపిఎం పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు పి రాజు ఏ వెంకటేష్ ఆంజనేయులు జిలాని ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య చేసిన సేవలను కొనియాడారు. సుందరయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సిపిఎం నేతలు పాల్గొన్నారు.


## తాగునీరు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి : ఎమ్మెల్యే



జలమండలి ఈడి పంకజకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, మే 19 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంగళవారం జలమండలి ఈడి పంకజతో చర్చించారు. ఈ మేరకు మంగళవారం జరిగిన సమావేశంలో ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గంలో తాగునీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థల దుస్థితిపై ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని అధికారులకు పలు సమస్యలు విన్నవించారు. ఉప్పల్ నియోజకవర్గంలో అత్యవసరంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే ఆమోదించి, ప్రాధాన్యత ప్రాతిపదికన నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు. ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరా, సక్రమమైన మురుగునీటి పారుదల సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

## నీట్ పరీక్ష నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం విఫలం : జక్కిడి



మెట్రో రైల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న జక్కిడి శివచరణ్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, మే 19 ప్రభాతవార్త:** నీట్ పరీక్ష నిర్వాహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వివలం అయిందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జెక్కిడి శివచరణ్‌రెడ్డి విమర్శించారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీని నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మెట్రో రైలులో వినూత్న నిరసన నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, దీంతో లక్షలాది మంది విద్యార్థుల పరిస్థితి ఆందోళనకరంగా మారిందన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడితే సహించేది లేదని జక్కిడి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర సహ ఇంచార్జ్ రోషిణిజైస్వాల్, ఐవైసీ అధికార ప్రతినిధి రాణీరాథోర్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధానకార్యదర్శులు యరమల రామచంద్రారెడ్డి, చంద్రిక, యువజన కాంగ్రెస్ రాష్ట్ర సెక్రెటరీ చాకలి శైలేందర్, హైదరాబాద్ యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి హజార్‌అన్సారీ తదితరులు పాల్గొన్నారు.


## జోనల్ కమిషనర్‌ను కలిసిన లచ్చిరెడ్డి




జోనల్ కమిషనర్‌కు బొకే అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ లచ్చిరెడ్డి.

**వనస్థలిపురం మే19,ప్రభాతవార్త.**
ఎల్బీనగర్ నూతన జోనల్ కమిషనర్ వికాస్ మహతోని జిహెచ్ఎంసి కార్యాలయంలో బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్‌కి అభినందనలు తెలియజేస్తూ, జోన్ పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని, బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ సహా పరిసర ప్రాంతాల్లో ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధం, రోడ్లు, వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు.

## సిఎం సహాయనిధి పేదలకు భరోసా : మల్‌రెడ్డి రాంరెడ్డి



చెక్కును లబ్ధిదారునికి అందజేస్తున్న చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడి

**మలక్ పేట, మే 19,ప్రభాతవార్త:**
ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు భరోసాగా నిలుస్తుందని తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి పేర్కొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని చింతలకుంట ప్రాంతానికి చెందిన కళ్ళకుంట్ల ఫణికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ. 1,00,000/ చెక్కును తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి చైతన్యపురి లోని కాంగ్రెస్ కార్యాలయంలో లబ్ధిదారుడికి అందజేశారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాహిత పాలనలో రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక పెద్ద అండగా నిలుస్తోందని తెలిపారు. ప్రజల కష్టసుఖాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సహాయం ఫణి కుటుంబానికి ఊరటనిచ్చేలా ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు

## సుందరయ్య ఆశయాలు నెరవేర్చాలి



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

**ఎల్.బి.నగర్, మే 19 ప్రభాతవార్త:** కష్టజీవుల రాజ్యాధికారం కోసం పోరాడిన సుందరయ్య ఆశయాల కోసం పోరాడాల నిసిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కీసరి నర్సిరెడ్డి పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ జయపురికాలనీ చౌరస్తాలో సుందరయ్య 41 వర్ధంతి కార్యక్రమాన్ని చెన్నారం మల్లేశం అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కష్టజీవుల కొరకు నిరంతరం పోరాడి, దున్నేవానికి భూమి కావాలని, వెట్టి చాకిరి విముక్తి కావాలని, భూస్వామ్య కుటుంబంలో పుట్టి తన భూముల్ని మొత్తం భూమిలేని పేదలకు పంచాడన్నారు. చిన్ననాటి నుండే కులవివక్షతకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడని, ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి పేదలవాడల్లో వాళ్ళు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాడాడని, సమస్యలకు పరిష్కారం కష్టజీవులకు రాజ్యం వస్తే తప్ప పరిష్కారం కాదన్నారు. కార్యక్రమంలో గంధం మనోహర్, బండ యాదయ్య, చైతన్య, శ్రీనివాసచారి, కుమార్ పాల్గొన్నారు.

## ఘనంగా బీరప్పస్వామి కళ్యాణోత్సవ వేడుకలు



రామంతాపూర్‌లో బీరప్పస్వామి కళ్యాణోత్స వంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తదితరులు

**రామంతాపూర్, మే 19 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లో బీరప్ప స్వామి, కామరాతి దేవి కళ్యాణ మహోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, ఒగ్గు కళాకారులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, బీరప్ప స్వామి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ బీరప్ప స్వామి, కామరాతి దేవి కళ్యాణ మహోత్సవం కురుమ, యాదవ సోదరుల ఐక్యతకు ప్రతీక అని, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఒగ్గు కళలు, సాంప్రదాయ పండుగలను భవిష్యత్తు తరాలకు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రామంతాపూర్ డివిజన్ అధ్యక్షులు వంగాల సంతోష్ గుప్తా, బిజెపి సీనియర్ నాయకులు వల్లపుజగన్‌యాదవ్, తాళ్ల బాలకృష్ణ గౌడ్, శాగ రవీందర్, రేవు కృష్ణయ్య, బీరప్ప, మహేశ్వర్ రెడ్డి పలువురు ఆలయ కమిటి నేతలు పాల్గొన్నారు.


## రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్ష పదవి కోసం బైగళ్ళ వినతి



డిసిసి అధ్యక్షుడు, టియుఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నర్సింహారెడ్డిని కలిసిన బైగళ్ళ ఓం ప్రకాశ్

**సరూర్‌నగర్, మే 19 ప్రభాతవార్త:** గత 20 సంవత్సరాలుగా దళితులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న తనకు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్ష పదవిలో నియమించాలని మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని జిల్లెలగూడకు చెందిన సీనియర్ దళిత నాయకుడు బైగళ్ళ ఓం ప్రకాష్ రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, టియుఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నర్సింహారెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన టియుఎఫ్ఐడిసి కార్యాలయంలో చల్లాను మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా కాలంగా దళితుల పక్షాన ఉంటూ చాలా కార్యక్రమాలు చేశానని అసైన్డ్ ల్యాండ్స్, లెదర్ సొసైటీ, వర్గీకరణ విషయంలో పనులు కూడా చేయడం జరిగిందని డిసిసికి వివరించారు. తన ప్రొఫైల్‌ను పరిశీలించి జిల్లా ఎస్సీ సెల్ పదవికి సిఫారసు చేయాలని కోరారు. పార్టీ పదవి ద్వారా దళిత సమాజంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి పార్టీని బలోపేతం చేయడానికి పని చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

## చెక్కు బౌన్స్ కేసులో నిందితుడికి శిక్ష



**కుషాయిగూడ మే 19, ప్రభాతవార్త**
చెక్ బౌన్స్ కేసులో నిందితుడు దొంకని నగేష్ గౌడ్ కు ఆరు నెలల జైలు శిక్షతో పాటు ఆరు లక్షల రూపాయలు చెల్లించాలని నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.కిరణ్ కుమార్ మంగళవారం తీర్పునిచ్చారు. ఘట్కేసర్ మండలం ఔషాపూర్ గ్రామానికి చెందిన దొంకని నగేష్ గౌడ్ 2014 సంవత్సరంలో మూడు లక్షల రూపాయలను మోలాలికి చెందిన గున్నాల అరుణ్ కుమార్ వద్ద చేబదులుగా తీసుకున్నాడు. అందుకు సంబంధించి చెక్కును అందజేశాడు. ఆ చెక్కు బ్యాంకులో డిపాజిట్ చేయగా బౌన్స్ అయింది. అందుకు సంబంధించి దొంకని నగేష్ గౌడ్ కాలయాపన చేస్తూ వచ్చాడు. న్యాయం కోసం గున్నాల అరుణ్ కుమార్ గౌడ్ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా 2022 మార్చి ఏడవ తేదీన 19వ అదనపు మెట్రోపాలిటన్ న్యాయమూర్తి పూజా కందుకూరి దొంకని నగేష్ గౌడ్ కు శిక్ష ఖరారు చేసింది. అదనపు మెట్రోపాలిటన్ న్యాయమూర్తి తీర్పు పై నిందితుడు దొంకని నగేష్ గౌడ్ జిల్లా కోర్టును ఆశ్రయించాడు. నిందితుడు దొంకని నగేష్ గౌడ్ అప్పీల్ ను నాల్గవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి డి. కిరణ్ కుమార్ కేసును కొట్టివేస్తూ మంగళవారం తీర్పును వెలువరించారు. దొంకని నగేష్ గౌడ్ ఆరు నెలల సాధారణ కారాగార శిక్షను విధించింది. చెక్కు మొత్తం మూడు లక్షల రూపాయలకు రెట్టింపుగా 6 లక్షల రూపాయలు అందజేయాలన్నారు. 2014 సంవత్సరం నుంచి మూడు లక్షల రూపాయలకు గాను సంవత్సరానికి 9 శాతం వడ్డీతో చెల్లించాలని కోర్టు ఆదేశించింది. వచ్చేనెల జూన్ 19వ తేదీ లోపు నిందితుడు దొంకని నగేష్ గౌడ్ ట్రయల్ కోర్టులో లొంగిపోవాలని లేని పక్షంలో నాన్ బెయిలబుల్ వారంటీతో అరెస్ట్ చేసి జైలుకు తరలించాలని ట్రయల్ కోర్టును నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.కిరణ్ కుమార్ ఆదేశించారు.